# ఓ కొత్త ఆలోచన

ఏ ప్రభుత్వ బాధ్యతయినా తన ప్రజలని శత్రువులనించి రక్షించి, వాళ్ళు సుఖంగా జీవించేలా పరిపాలించడం. ఈ ప్రధాన బాధ్యతని మన దేశంలోని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎంతదాకా నిర్వర్తిస్తున్నాయి అంటే వచ్చే జవాబు శూన్యం. ప్రజల శ్రేయస్సుకి వుపయోగించాల్సిన సొమ్మని ప్రభుత్వంలోని పెద్ద మనుషులు లంచాల రూపంలో స్వాహా చేస్తున్నారన్నది అనేకసార్లు రుజువయింది.

విదేశానికి చెందినవారు మన దేశంమీద దాడి చేస్తే, మన సైనిక బలాన్ని వుపయోగించి వారిని ఎలా తిరగ్గొట్టి మన దేశాన్ని రక్షించాలని ఏ ప్రభుత్వం ప్రయత్నిస్తుందో, అదే విధంగా ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా ప్రవర్తించే దేశంలోని రాజకీయ నాయకులని కూడా తిరగ్గొట్టాల్సిన బాధ్యత ఎవరిమీదయినా వుండాలి. ముఖ్యంగా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన మన దేశానికి ఇది చాలా అవసరం. రోజు రోజుకీ అవినీతి, అధికార దుర్వినియోగం, రాజకీయ శక్తుల దౌష్ట్యం అధికం అవుతున్న మనదేశంలో ఎన్నడో రాసిన రాజ్యాంగంలో అనేక మార్పులు చేర్పులు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో వుంది.

నేటి భారత ప్రజల సంక్షేమానికి అన్నిటికన్నా ముఖ్యం 'స్వార్థ రాజకీయ నాయకులు' పదవిని అలంకరించకుండా వుండగలగడం. ఇందుకు రాజ్యాంగంలో చేయాల్సిన మార్పులు, ఏ రాజకీయ నాయకుడు ఎన్నికల్లో రిగ్గింగ్ చేసినా (నేరస్థుల మీద సి.బి.సి.ఐ.డి. విచారణ చేసే పద్ధతిలో విచారణ జరిపించి) నేరం రుజువయితే యావజ్జీవ కారాగారశిక్ష విధించడమే కాక, మరెన్నడూ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం వుండరాదని నియమం పెట్టడం. పోలింగ్ బూత్‌ల దగ్గర గూండాలని పెట్టించడం, ఓట్లని సారాకో, రూపాయిలకో కొనడం, ఓటర్లని బెదిరించి ఓటు వేయకుండా వెనక్కి పంపడం లాంటి చర్యలకి పాల్పడినా కూడా పై నియమం వర్తించాలి.

పదవిలో వుండగా ఏ రాజకీయ నాయకుడు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డా, అంటే లంచాలు తీసుకోవడం, అక్రమ బదిలీలు, ఏంటి కరప్షన్ బ్యూరో పట్టుకోవడంవల్ల వుద్యోగాలు వూడినవారిని తిరిగి వుద్యోగాల్లోకి తీసుకోవడం లాంటి ఏ రకమయిన స్వార్థ, ప్రజా సంక్షేమ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టినా అతను యాంత్రికంగా పదవిని కోల్పోవడమే కాకుండా, జీవితకాలంలో ఎన్నికల్లో పాల్గొన కూడదనే నియమం పెట్టడం కూడా నేడు మన దేశ ప్రజల సంక్షేమం దృష్ట్యా ఎంతో అవసరం.

ఏ దినపత్రిక చూసినా పబ్లిక్ టాయ్‌లెట్ కన్నా అధ్వాన్నంగా వుంటోంది. పాలకవర్గం మీద ప్రతిపక్షం ఆరోపణలు, దాన్ని కొందరు సపోర్ట్ చేస్తే ఇంకొందరు ఖండించడాలు అధికం అయిపోయాయి. ఇలాంటి ఆరోపణలు ప్రచురించినప్పుడు వాటిలోని నిజానిజాలని విచారించి, నిజం వుంటే పాలకవర్గానికి చెందినవారిని, అబద్ధం అయితే ఆరోపణలు చేసినవారిని శిక్షించే ఓ కొత్త 'పొలిటికల్ పోలీస్' వ్యవస్థని ఏర్పాటు చేయాలి. వీటిలో అధిక జీతం తీసుకునే ఐ.పి.ఎస్. ఆఫీసర్స్ లాంటి చదువుకున్న, సంస్కారం, సభ్యత గలవారిని తప్ప, రోడ్డు సైడ్ కిళ్ళీకొట్లోని అరటిపళ్ళ గెలలోంచి డబ్బివ్వకుండా పీక్కుని తినే కాన్‌స్టేబుల్స్‌ని వుంచరాదు ఇలాంటి ఆరోపణలలో ఏవి నిజాలో, ఏవి అబద్ధాలో ప్రజలకి తెలీక ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో అర్థం చేసుకోలేని అయోమయ స్థితిలో వున్నారు.

ప్రజా ప్రతినిధులుగా ఎన్నికల్లో నిలబడేవారి కనీస అర్హతలని నియమించాల్సిన తరుణం ఏర్పడింది. గూండాలు ప్రజా పాలకులు కాకుండా వుండటానికి అనువుగా గతంలో క్రిమినల్ కేసుల్లో శిక్షపడ్డ లేదా రౌడీ షీటర్స్ జాబితాలో వున్న లేదా నేరారోపణలున్న వారు జీవిత కాలం ఎన్నికల్లో నిలబడ్డానికి అనర్హులుగా కొత్త నియమం రావాలి. ఇందువల్ల రాజకీయాల్లోని సగం చీడ తొలగిపోతుంది. అలాగే రాజకీయ కారణాల కోసం ప్రజా ప్రతినిధులు గూండాలని నియమించడం ఋజువయితే వారు జీవితకాలంలో ఎన్నికల్లో నిలబడే అర్హతని

కోల్పోయేలా రాజ్యాంగం మార్చాలి.

ప్రభుత్వ ఉద్యోగులకి వర్తించే అన్ని నియమాలు, అంటే వారిమీద క్రిమినల్ కేసులువస్తే సస్పెన్షన్, శిక్షపడితే వుద్యోగంలోంచి డిస్‌మిసల్. ప్రతి సంవత్సరం ఆస్తుల వివరాలుపై అధికారులకి తెలపటం, లంచం తీసుకున్న నేరారోపణ రుజువయితే డిస్‌మిసల్‌లాంటి కాండక్ట్‌రూల్స్ అన్నీ ప్రజా ప్రతినిధులందరికి స్ట్రిక్ట్‌గా అప్లై అవాలి. కనీసం గ్రాడ్యుయేట్ అయి ఉంటే కాని ఎన్నికల్లో నిలబడేహక్కు వుండకూడదు. వారికి కూడా సామాన్య ప్రజల్లా ఇన్‌కంటేక్స్‌రూల్స్ వర్తించాలి.

దేశంలో ఎవరికీ బంద్‌లు నిర్వహించే, అందుకు పిలుపునిచ్చే అధికారం వుండకూడదు. ఎవరయినా ప్రొటెస్ట్ చేయదలచుకుంటే గాంధీమహాత్ముడిలా సత్యాగ్రహం చేయటం ఒక్కటే చేయాలి. లేదా న్యూయార్క్ నగరంలో మేయర్ హాల్ మెట్లమీద ప్రొటెస్ట్‌చేసే విధంగా ప్రతివూరికి ప్రొటెస్ట్‌కి కొన్ని ప్రదేశాలు నిర్ణయించాలి. బంద్‌లవల్ల, రాస్తారోకోలవల్ల, జైల్‌భరోలవల్ల, ధర్నాలవల్ల పిల్లల చదువులు, దేశీయ వుత్పత్తిస్థాయి తగ్గిపోతున్నాయి. బస్‌లు, రైల్వేబోగీలు లాంటి ప్రభుత్వ లేదా ప్రజల ఆస్తికి జరిగే నష్టానికి అలా బంద్‌లకి పిలుపునిచ్చినవారే బాధ్యులయి, వ్యక్తిగతంగా దేశద్రోహ నేరానికి కోర్టుకి తీసుకురాబడాలి. ప్రజలకి జరిగే ప్రాణనష్టానికి హత్యా నేరంమీద ముద్దాయిగా కోర్టులో నిలబడాలి.

నేటి పరిస్థితిలో పదవిలో వున్న ముఖ్యమంత్రి కాని లేదా ప్రధానమంత్రి కాని తన పదవీ కాలంలోని తాంభై శాతం టైంని, తనని పదవిలోంచి లాగడానికి అసమ్మతివర్గాలు, ప్రతిపక్షవర్గాలు చేసే ప్రయత్నాలని గుర్తించి, ఎదురెత్తులు వేయడానికే కేటాయిస్తున్నారు. ఏ పేపర్‌లో చూసినా ఈ వార్తలేతప్ప ప్రజాశ్రేయస్సుకి ముఖ్యమంత్రి కొత్తగా ఏ పథకాలు గురించి ఆలోచిస్తున్నారో, ఏవి చేపట్టారో తెలియజేసే వార్తలేలేవు. ముప్పైఏళ్ళ క్రితానికి, ఇప్పటికి మన పవిత్ర భారతదేశంలోని రాజకీయ నాయకుల ప్రోగ్రెస్ ఇది.

అలాగే ప్రతి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నియమించే గవర్నర్ ఆ రాష్ట్ర పాలనని సెక్రటరీల ద్వారా చూడాలి కాని రాష్ట్రం రాష్ట్రానికి ముఖ్యమంత్రులు ఇతర మంత్రులు అనవసరం.

రాజకీయపోస్టులు అధికం అయిన కొద్దీ అవినీతి కూడా అధికం అయి అభివృద్ధి కుంటుపడుతుందన్నది చరిత్ర రుజువుచేస్తున్న సత్యం. ఎన్నికలనేవి కేవలం కేంద్ర ప్రభుత్వానికే జరగాలి కాని రాష్ట్రస్థాయిలో అనవసరం.

ఒకవేళ ప్రస్తుత విధానమే కొనసాగాలనుకుంటే ప్రతి రాష్ట్రానికి ముఖ్యమంత్రికాక ఎంతమంది మంత్రులుండచ్చో సంఖ్యని రాజ్యాంగం నిర్ణయించాలి. దీనివల్ల రాజకీయాలవల్ల మంత్రివర్గ విస్తరణ, అందువల్ల పెరిగే ఖర్చు, అవినీతిని అరికట్టడం జరుగుతుంది. మంత్రుల సంఖ్య ఛాయిస్ ముఖ్యమంత్రి చేతిలో కాక రాజ్యాంగం చేతిలో వుండడం సర్వత్రా శ్రేయస్కరం.

ఇందువల్ల ప్రజలందరికి సమానంగా న్యాయం జరుగుతుంది. మహారాష్ట్రలో వున్న ప్రజలకి సేల్స్‌టేక్స్ తక్కువ. తమ తప్పిదం లేకుండా దేశ ప్రజలకి ఇలా అనేక విషయాల్లో వ్యత్యాసం తప్ప సమానత్వం లేదు. రాజ్యాంగం వస్తువుల విషయంలో ఈ సమానత్వాన్ని అందివ్వాలి. పాండ్స్‌పౌడర్ కాని, హమామ్ సబ్బుకాని ఏ రాష్ట్రంలోకొన్నా ధరలో టేక్స్‌వల్ల హెచ్చుతగ్గులుండకూడదు.

కొంతకాలం ఎన్నికల తర్వాత పార్టీ ఫిరాయించడం రాజకీయ వర్గాలవారు చేసిన ట్రిక్. ఈ దాష్టీకాన్ని అరికట్టడానికి రాజీవ్‌గాంధీ ఫిరాయింపుచట్టం తెచ్చి, ఎన్నికయిన ఎం. ఎల్. ఎ. పార్టీ మారితే తన పదవిని కోల్పోతాడు అనే మార్పు చేయడంవల్ల ఆ మార్గం శుభ్రంగా వుంది. అదే పద్ధతిలో పైమార్పులు చేస్తేనే భారత ప్రజలు రాజకీయ నాయకులు ఏ ఏ విధాలుగా తమ ప్రజల్ని మోసం చేస్తున్నారో ఆ మార్గాలన్ని మూసేసినట్లవుతుంది. రాజకీయాల్లోని అవినీతి కొంతవరకయినా రూపుమాసి దేశం అభివృద్ధి మార్గంలో పయనించే అవకాశం, ప్రజలు సుభిక్షంగా బ్రతికే పరిస్థితి ఏర్పడచ్చు.

అయితే ఈ మార్పులు రాజకీయవర్గాలవారి దృష్టికి వెళ్ళినా చేయరు. ఎందుకంటే తాము కూర్చున్న చెట్టుకొమ్మని తామే నరుక్కున్నట్లుగా అవుతుంది కాబట్టి, మనదేశంలో రష్యాలో, చైనాలోలాంటి అతి పెద్ద రాజకీయ మార్పు రావడానికయినా ఒప్పుకుంటారు కాని దేశ క్షేమంకోరి ఈ మార్పులు చేయరు. ఎందుకంటే, ఇలాంటి ఆలోచనలు కేవలం దినపత్రికల్లోని ఇలాంటి కాలానికే పరిమితంఅయ్యే దేశం భారతదేశం.

(శుభం)

A

BOOK BY

LIPI PUBLICATIONS


మల్లాది వెంకట కృష్ణమూర్తి

# రెండు రెళ్ళు ఆరు

'మల్లాదికి ఎక్కాలు రావు' అనుకుంటున్నారా? వచ్చండి.

మీరు హాస్యప్రియులయితే, ప్రేమ నవలలు ఇష్టపడే వారయితే, ఈరోజు నవ్వుల జల్లులో తడవాలనుకుంటే, హాస్యపు హరివిల్లుని చూడాలనుకుంటే దీన్ని చదవండి. 'రెండు రెళ్ళు ఆరు' ఒప్పని మీరే అంటారు.

**1994 ఏప్రిల్ మొదటివారం విడుదల**